
**రామాపురానికి, కృష్ణపురానికీ, మధ్య తాజావైరం ప్రారంభం అయింది పోయిన సంవత్సరం గట్టు లింగయ్య తిరునాళ్ళలో అంటే దాని అసలు ప్రారంభం అప్పుడే అని అర్థం ఎంతమాత్రం కాదు.**



# రాగద్వేషాలు

ఎమ్.హెచ్.వి. సుబ్బారావు

మళ్లీ పదిహేనురోజుల్లో ఆ తిరునాళ్ల రాబోతుంది. యీసారి కృష్ణపురం వాళ్ళు సర్వ సన్నద్ధులైవున్నారు, ప్రతీకారం తీర్చుకోవడానికి. పోయిన సంవత్సరం ఆ తిరునాళ్లలో కృష్ణపురం మనుషులు యిద్దరు బలయ్యారు. యీ సంవత్స రం రామాపురం మనుషుల్ని వడ్డీతో సహా., కనీసం ముగ్గురినేనా లేపెయ్యకపోతే కృష్ణపురా నికి యిక ఆచుట్టుపక్కల వూళ్లలో తలెత్తుకు తిరిగే యోగ్యతలేదు.

అర్ధరాత్రి పన్నెండు గంటలకి జరిగే తిరునాళ్లకి సాయంత్రం ఆరుగంటలనించే లింగయ్య గట్టు చుట్టు పక్కల వూళ్లవాళ్లంతా బైలుదేరారు. అందరూ తలోకర్రపుచ్చుకుని, బాగా వళ్లుతెలీకుండా తాగి దారిపొడుగునా కేకలు పెట్టుకుంటూ నడుస్తున్నారు. లింగయ్య గట్టు చుట్టుపక్కల వూళ్లలో చిరతలు తిరుగుతాయని వదంతి. అందుకే కాగడాలు ముట్టించుకుని కర్రలతో కోలాటాల్లా చప్పుడు చేసుకుంటూ, తాగిన మైకంలో అశ్లీలమైన హాస్యాలాడుకుంటూ వెళ్తున్నారు.

ఆరోజు మధ్యాహ్నం నుంచీ కృష్ణపురం గ్రామపెద్దలంతా రహస్య సమావేశం జరుపుతూనే వున్నారు. యీ సంవత్సరం పోలీసు బందోబస్తు చాలా ఎక్కువగా ప్రవేశపెడుతున్నారట. గట్టులింగయ్య తిరునాళ్లలో పోలీసు రక్షణా? కృష్ణపురం వాసులంతా బిగ్గరగా నవ్వుకున్నారు. వాళ్ల తాతలకాలం నించీ వాళ్లు గట్టు లింగయ్య తిరునాళ్లని గురించిన కథలు వింటూనే వచ్చారు. గట్టులింగయ్య తిరునాళ్లలో ఏపార్టీ అయినా నష్టపడితే దానికి ప్రతీకారం మళ్లీ వాళ్లే అదే తిరునాళ్లలో తీర్చుకోవాలి. అదే మగతనమనీ, అదే పౌరుషమనీ, ప్రభుత్వాన్నీ, చట్టాన్నీ శరణుకోరడం పిరికితనమనీ వాళ్ల తండ్రులూ, తాతలూ నూరిపోశారు. తెల్లదొరల కాలంలో గూడా వాళ్లు ఏనాడు వీళ్ల ఆంతరంగిక విషయాల్లో జోక్యం కలిగించుకోలేదు. అలాంటిది యీ సంవత్సరం ఎన్నడూలేని పోలీసుకాపలా అంటే అది రామాపురం వాళ్లు తమదెబ్బకి హడిలిపోయి పోలీసుల్ని శరణువేడడం అన్నమాట..

ఆ ఆలోచన కృష్ణపురం ప్రజల్ని మరింత గర్వపరచింది. తమని పోలీసుల్ని చూపి భయపెట్టగలం అనుకున్నారు గాబోలు! తమ పోతుగడ్డలో జన్మించిన పసిబాలుడైనా పిరికితనం అనేది ఎరగడు. పోలీసులే కాదు. సాక్షాత్తూ ఆపరమేశ్వరుడె వచ్చినా తాము ఆ రామాపురం వాళ్ల మీద పగసాధించక మానరు.

చుట్టుపక్కల అన్ని వూళ్లలోనూ కృష్ణపురం తీసుకున్న యీ నిర్ణయం పాకిపోయింది. కొంద రు కృష్ణపురం ప్రజలు రహస్యంగా పిస్తోళ్లు దాచుకున్నారన్నారు. కొందరు కత్తి, కర్రలు పోగుచేశారన్నారు. కొందరు చేతిబాంబులు సేక

రించారన్నారు. ఎన్నెన్నో వ్యూహాగానాలు చెలరేగాయి కాని అసలు కృష్ణపురం ప్రజల పథకమేమిటోఎవ్వరికీ అర్థంకాలేదు. 'తినబోతూ రుచులెందుకు?' అనుకుని సరిపెట్టుకున్నారు.

రామాపురం, కృష్ణపురం మధ్య యీ వైరం కొత్తదిగాదు. పది పదిహేనేళ్లుగా సాగుతోంది. ప్రతి ఏడాదీ వంతులవారీగా వాళ్ల వీళ్లనీ, వీళ్ల వాళ్లనీ చంపుకుంటూనే వున్నారు.

రామాపురం గురించి గూడా చుట్టుపక్కల వూళ్లలో వ్యూహాగానాలు చెలరేగక పోలేదు. తామే పోలీసుల సహాయాన్ని అర్థించినట్లుగా వచ్చిన వదంతిని వాళ్లు పూర్తిగా ఖండించారు. తాము అంతచేతగాని వాళ్లంకాదన్నారు. "యీ సంవత్సరం వాళ్లు దెబ్బతీస్తే వచ్చేసంవత్సరం మళ్లీ తిరుణాళ్ల రాదా? అయిపోయెనా?" అన్న ప్రతిజ్ఞలు రామాపురంలో వినబడ్డాయి. పోలీసుల రాకకి కారణం కేవలం "పైనించి" వచ్చిన వుత్తర్వులే అని గూడా ధృవపరిచారు.

అయితే సంప్రదాయం ప్రకారం యీ సంవ త్సరం రామాపురం కర్తవ్యం 'డిఫెన్స్' మాత్ర మే గనక ఆవూరి ప్రజలంతా అప్రమత్తులై కృష్ణపురం ప్రజల కదలికల్ని గమనిస్తూ వుండా లని నిర్ణయించుకున్నారు....

అన్ని వూళ్లనించీ ప్రజలు మెల్లమెల్లగా లింగయ్య గట్టు దగ్గిరికి చేరుతున్నారు. ప్రజల కోలాహలధ్వనులు ఆకొండల్లో మారుమ్రోగుతున్నాయి. 'గట్టుమీద దేవరా! కాపాడు తండ్రీ!' అనే నినాదాలు మిన్ను ముట్టుతున్నాయి. కేకలు, తొక్కిడి ... జనసముద్రం పెడుతోన్న ఓ లయరహితమైన ఘోష తప్ప విడివిడి వ్యక్తుల కంఠస్వరాలు వినిపించడంలేదు. పదిగంటల వేళకి అన్ని గ్రామాల ప్రజలూ కొండమొదలుకు చేరుకుని పైకి ఎక్కడం ప్రారంభించారు.

వాళ్ళల్లో స్వామివారిని చూడాలని వచ్చిన వాళ్ళూ, వాళ్ళని చూడాలని వచ్చినవాళ్ళూ, రూపస్పర్శ గంధాదుల ఆనందం పొందాలని వచ్చిన వాళ్లు- అన్నిరకాల వాళ్లూ వున్నారు. వీళ్లందరికీ మధ్యలో ఏపిల్లలో మారంచేస్తే జంతికలూ, చేగోడీలూ, పుణుకులూ సరఫరా చేసే చిల్లర వ్యాపారులున్నారు. దారిలో నిషాదిగిపోయిన వారు ఆశాభంగం చెందకుండా వారిని నిరంతరోన్మత్తులుగా నిలబెట్టెందుకు కంకణం కట్టుకొన్న మల్లర వ్యాపారులూ వున్నారు.

"ప్రజానీకానికి ఒక హెచ్చరిక- యీ గుట్ట నేటి సాయంత్రం ఎనిమిదిగంటల నుండీ రేపు ఉదయం 8 గంటల వరకూ కల్లోలిత ప్రాంతంగా ప్రకటింపబడింది. ఎవరి వద్ద ప్రమాదకరమైన ఆయుధాలు లభించినా వారు వెంటనే నిర్బంధంలోనికి తీసుకోబడతారు. ఒక్కొక్కరే క్యూవెంట వెళ్లి దైవదర్శనం చేసుకోవాలి. భూతాచారి భవిష్యం చెప్పే వేళలో గూడా యివేనియమాలు వర్తిస్తాయి. యీ నియమాలకి కట్టుబడని వాళ్లపై చర్య తీసుకోబడుతుంది" అని పోలీస్ వ్యాన్ మైకులో హెచ్చరిస్తోంది.

జనం మెల్లిమెల్లిగా ఆలయం వేపు ఎక్కుతున్నారు. ఆలయం అంటే ప్రత్యేకంగా నిర్మంపబడిందేమీ కాదు. రెండు కొండరాళ్ల మధ్య సహజంగా ఏర్పడిన ఓ ఖాళీ అంతే!

అర్ధరాత్రి సమీపిస్తోంది.

ఆలయప్రాంతం లోంచి "...ఓహో..." అని పెద్దకేక వినబడింది. అందరూ—పోలీసుల్తో సహా—నిశ్శబ్దంగా నిలబడి పోయారు. మొహంమీద రూపాయి కాసంత బొట్టూ, మెళ్లో రుద్రాక్షల పేరూ, చెవులకు భయంకరమైన అంటుజోళ్లూ, మిడిగుడ్లూ, విరబోసుకున్న జుట్టూ—యిదీ రెండు చేతుల్తో రెండు వెపమండలూ పుచ్చుకుని—వంటినిండా కత్తులు గుచ్చుకుని రక్తం ఓడుతోన్న శరీరంతో దర్శనమిచ్చిన భూతాచారి స్వరూపం.

భూతాచారి వూగిపోతూ 'భవిష్యం' చెప్పడం ప్రారంభించాడు.

సాంబశ్శివా...సాంబశ్శివా...

అని హుంకరిస్తూ ప్రారంభించాడు భూతాచారి.

సాంబశ్శివా...శ్శంకరా...పలుకు...పలుకు.. నీనోట పలుకు...నాలుగుకారులు వానలు కురిసేనా శంకరా?" అని ప్రశ్నించుకుని "హ్హా... రెండే కారులురా బసవా"

అని తనే జవాబు చెప్పుకున్నాడు.

క్షణంలో నిషాలో హుషారుగా వున్న అందరి

## రావణ కాష్టాలు


కాలం వెలిగించిన నెగళ్ళు,
ధరిత్రినలముకున్న పొగచీకట్లు,
ఘరానా సాహెబ్‌ల
ఘనకీర్తి పట్టు కొమ్మలు,

భూమి తల్లి కడుపుకోత
గుండెలపై టన్నుల మోత
నైజీరియా, రొడీషియా,
ఎన్నటికీ సశేషమయా

ఆఫ్ఘన్లూ, టిబెటన్లూ
అండలేని కొండవాళ్ళు
దిక్కు లేని బండ రాళ్ళు!
పేరేదైతేనేం ఒకే కథ,
ఒకే బాధ, ఒకే బాట

ఇరాన్ ఇరాక్
ఎన్నాళ్ళకు ఎన్నేళ్ళకు
ఈ వైరం ఈవైనం
అంతమయే దేన్నేళ్ళకు?

జి.వెంకట రమణ



మొహాలు కళతప్పాయి. అదునులో వర్షాలు పడక పోతే...తమగతి...వూళ్లో షావుకారు దగ్గర పెరిగిపోతున్న అప్పులు...ఒక్కో ఎకరమే వాకట్టుగా మారిపోతోన్న తాకట్టూ కళ్ల ముందు మెదిలాయి. వెన్ను జలదరించింది. యిట్లా అయితే వచ్చే సంవత్సరం యీ పాటికి మనం పట్నంలో రిక్షా తొక్కుతూండాలి... అని దిగులు పడ్డారు.

"పైరు పచ్చలెట్లా వుండేనురా సదాశివా!" అన్న భూతాచారి మాటలకి మళ్లీ అందరూ తలలు అటువేపు రిక్కించారు.

"ఓహ్హోహ్హో..." అని కొరడాతో ఆ భుజం పైనా యీ భుజంపైనా చరుచుకుని

"తెల్ల ధాన్యాలన్ని తేలిపోయేనురా బసవా" అన్నాడు.

అందరి మొహాలు మరింత నిర్జీవమయ్యాయి.

"జరుగుబాటెట్లేను? గరళం మింగుదుమా? ...శంభోశ్శంకరా...పలుకు"

"రూకకి పరక మిగిలేను లేరా బసవా"

అందరి మొహాల్లోకీ కొంచెం కళ వచ్చింది. ఫరవాలేదు. తిన్నా తినకపోయినా షావుకారు అప్పు యీ సంవత్సరం వాయిదా చెల్లిపోతుంది.

"ఎర్ర ధాన్యాలన్నీ ఏ మాత్రమయ్యేను హరహరా!"

"ఎర్రధాన్యాలన్నీ వెలిగి పోయ్యేనులే బసవా!"

"ఏనుగు లేక్కేరా యిశ్శేశ్వరా?"

"నోటికీ చేతికీ లోటు లేకుండరా బసవా"

భూతాచారి యింకా వూగుతూనే వున్నాడు. కాని ప్రశ్నలూ - జవాబులు ఆగిపోయాడు.

భూతాచారి ఆపడం చూసి ప్రజలు ప్రశ్నలు ప్రారంభించారు.

"ధాన్యం కడవ ఎంత కమ్మేను దేవరా?"

"నూరు వరాలకి కడవన్నరయ్యేనులే"

"పత్తిపంట బాగయ్యేనా?"

"ధనియం ధర ఎట్లుండేను?"

ఇలా ప్రశ్నలు ఒక అరగంట వరకూ వస్తూనే వున్నాయి. భూతాచారి ఓపిగ్గా అన్నిటికీ జవాబులు చెబుతున్నాడు. చెప్పిన జవాబులు చెప్పినట్లుగా పావురాయి టపాతో అన్నివూళ్లకీ ప్రసారం చేయబడుతున్నాయి.

భూతాచారి భవిష్యాన్ని వినడంలో నిమగ్నులైపోయిన రామాపురం ప్రజలు వాళ్ల ప్రక్కనే

## శేషేంద్రజాలం

జీవించడంలోనే జీవితమంతా
ఖర్చుచేశి అలశిపోయాడు
అతడు వర్తమాన కాలంలో నుంచి
చరిత్రలోకి వలస పోయాడు

రైతు లాంటి నదికి పొలాలతోనే పని
నాలాంటి కాగితానికి కలాలతోనే పని
చంద్రబింబం తుఫానుగా మారిన రాత్రి
నా కన్నులకు రంగురంగుల కలల్తోనే పని

— శేషేంద్ర

కృష్ణాపురం ప్రజలు కొందరు నిల్చున్నట్లు గాని అందులో ఒకడు తమలో ఒకడి కాలు గట్టిగా తొక్కినట్లు గాని గమనించలేదు.

"అబ్బా" అంటూ కాలు నొప్పితో మూలుగుతూనే అతను తన చేతిలో వున్న బాణాకర్రని గాల్లో విసిరాడు. అదే అదనుకోసం ఎదురు చూస్తున్న కృష్ణాపురం యువకుడు ఒడుపుగా తన చేతిలోని కర్రతో రామాపురం యువకుని చేతిలోని కర్రపై గట్టిగా ఓ దెబ్బ వేశాడు.

కర్రల చప్పుడు వింటూనే రామాపురం ప్రజలంతా ఒక్కసారి మేల్కొన్నట్లు

"కృష్ణాపురం మనుషులు మన మనిషిని చంపేశారు. ఊఁ! యింకా చూస్తారేం?! తల పడండి" అని ఒకరినొకరు ఉసి కొలుపుకున్నారు.

ఆ తర్వాత అరగంట సేపటివరకూ ఎవరు ఏమేం మాట్లాడారో, ఎవర్ని ఎవరు కొట్టారో, ఎవరికి దెబ్బలు తగిలాయో, వినబడే హాహాకారాలు ఏవూరి వాళ్లవో అంతు బట్టకుండా పోయింది. అప్పుడు హఠాత్తుగా వున్నటుల్లండి,

"రామా!"అని పెద్దగా కేక,దానితో పాటే "శ్రీరామ రామ రామ" అనే సన్నని మూలుగూ వినవచ్చాయి.


ప్రజలందరూ దెబ్బలాట కాస్సేపు విరమించి ఆ దురదృష్టవంతుడెవరో పరీక్షించడానికి గుమిగూడారు.

క్షతగాత్రుణ్ణి చూడగానే యిరువైపుల వాళ్లకీ గుండెలు అవిసిపోయాయి.

ఆయన హైస్కూలు టీచర్ సిద్దేశ్వరరావు.

"మావూరి పిల్లలకి పాఠాలు చెబుతున్నారని,దైవంలాంటి మాష్టార్ని పొట్టన బెట్టుకున్నారా?! దేవవుంటే మామీద చూపించాలి. అన్నెం పున్నెం ఎరుగని మాష్టారేం చేశారు?! అన్నారు రామాపురం ప్రజలు.

"వాళ్లింట్లో పిల్లలకి పాఠాలు చెప్పేబడి మావూరి పొలిమేర్లో వుందని గాదటయ్యా మీరాయన ప్రాణం తీసింది! మళ్లీ నంగనాచుల్లా



మాట్లాడుతున్నారా? మీ వూరి మనిషి మాస్టారి పై కత్తులెత్తుతూండగా మేం స్వయంగా చూశాం అన్నారు కృష్ణాపురం ప్రజలు మరో మెట్టు పైకి వెళ్లి.

—ఇక్కడ కొంచెం సిద్ధేశ్వరరావు మాస్టార్ని గురించీ, అలాగే ఆ వూరి హైస్కూలు గురించీ చెప్పాలి—

ప్రభుత్వం ఉన్నత విద్యావ్యాప్తిధ్యేయంతో వూరూరా హైస్కూళ్ళు పెడుతోన్న రోజుల్లో రామాపురం,కృష్ణాపురం గ్రామాలు రెండూ పెద్దవి గనుక ఆ వూళ్లల్లో హైస్కూళ్ళు పెట్టాలని సిఫారసు వెళ్లింది. అయితే రూల్సుకి ఏ మాత్రం విరుద్ధంగా ప్రాణం పోయినా వర్తించని ఓ డి.యీ.వో.గారు రామాపురం,కృష్ణాపురం రెండూ పెద్దగ్రామాలే ఐనా—రెండింటి మధ్య దూరం రెండు మైళ్లేగనుక— జీవోయంయస్ నంబర్ ఫలానా డేటెడ్ ఫలానా ప్రకారం, ఆ రెండు గ్రామాల్లో ఏదో ఒక గ్రామంలో మాత్రమే వీలవుతుంది గాని, రెండు చోట్లా హైస్కూలు పెట్టడం కుదరదని చాలా పకడ్బందీ గా రిపోర్టు రాశారు. దాని ఫలితంగా రెండు గ్రామాల మధ్యగా సరిహద్దుల్లో హైస్కూలు వెలిసింది. అయితే, అక్కడ పని చేయవలసిన ఉపాధ్యాయులకి మాత్రం ఓ పెద్ద చిక్కు వచ్చి పడింది. వాళ్ల రామాపురంలో కాపురాలు పెడితే కృష్ణాపురం ప్రజలకి కోపం. కృష్ణా పురంలో కాపురం పెడితే రామాపురం వాళ్లకి కోపం. ఏదేనా ఓ వూళ్లో వున్న మాస్టారి సబ్జెక్ట్‌లో ఎదర వూరివాళ్లు ఎక్కువమంది తప్పారో, ఆ మాస్టారు పక్షపాతంతో చేశారని ఆయన మీదికి దండెత్తేవారు.

యీ సమస్యకి పరిష్కారం సిద్ధేశ్వర రావు మాస్టారు వచ్చేక ఓ చక్కని పరిష్కారం సూచించారు. స్కూలు ఉపాధ్యాయులందరికీ, స్కూలు ఆవరణలోనే పాకల్లాంటి 'క్వార్టర్స్' ఏర్పాటు చేయించారు.

సిద్ధేశ్వరరావుగారంటే ఉభయ గ్రామాల్లోనూ భక్తి గౌరవాలు పుష్కలంగా వున్నాయి. చదువు బాగా చెబుతారనీ, అందరకీ అణుకువగా వుంటారనీ, చిన్నకీ పెద్దకీ కష్టంలో సుఖంలో ఆదుకుంటాడనీను, అయితేనేం, ఆయన గాయపడి చావుబ్రతుకుల్లో వుంటే ఆ విషయాన్ని సైతం తమ కక్షలు సాధించుకోడానికి సాధ్యంగా వాడుకోవాలనే ప్రలోభాన్ని మాత్రం జయించలేకపోయారు.

రామాపురం కుర్రాళ్లకి పాఠాలు చెప్పడాన్ని వాళ్ల సాకుగా తీసుకుంటే అంతకుముందెప్పుడో ఆ వూరి కరణం సరదాగా అన్నమాటని వీళ్ల సాకుగా తీసుకున్నారు. ఓరోజు కరణం, సిద్ధేశ్వరావుగారింటికి ఏదో పని మీద వచ్చి తిరిగి వెళ్తూ ఓసారి యిల్లంతా కలయజూసి, "మాస్టారూ! మీరెంత విశాల హృదయులైనా పక్షపాతం చూపించారు. మీయిల్లంతా రామాపురానికి చెందిన 149వ సర్వేనంబర్లో కట్టుకున్నా, పిల్లలకి పాఠాలు చెప్పేగది మాత్రం కృష్ణాపురానికి చెందిన 23వ సర్వేనంబర్లో కట్టుకున్నారు" అన్నాడు.

యీ మాట ఆనోటా ఆనోటా రెండు గ్రామాల్లో వ్యాపించినా మాస్టారియందుండే అభిమానంచేత ఎవ్వరూ పట్టించుకోలేదు.

ఎవరో గుంపుగా వున్న ప్రజల్ని మందలిస్తూ మాస్టారికి కాస్తబాగా గాలి రావడానికి వీలుగా చుట్టూ కాస్త ఖాళీ చేయించారు. మాస్టారి హీన స్వరంతో,

"ఎవరు గెల్చారు బాబూ?" అన్నారు యిరుపక్షాలవాళ్లనీ ఉద్దేశించి. అందరూ ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నారు.

మాస్టారు విషాదంగా నిట్టూరుస్తూ,

"నేనెంత వ్యర్థజీవిని? నాయిల్లు యింకొక్క నాలుగు గజాలు వెనక్కి జరిపి కట్టుకుని వుంటే ఒక విరోధినయినా చంపి పగ తీర్చుకున్నామన్న తృప్తి మీకయినా మిగిలేదిగదా! అన్నారు కృష్ణాపురం ప్రజలు నుద్దేశించి.

కృష్ణాపురం ప్రజలు చేతులు జోడిస్తూ,

"అంతమాటనకండి మాస్టారూ! మీరుమాకు విరోధి ఎలా అవుతారు? మీరు దైవసమానులు" అన్నారు కన్నీళ్లతో.

మాస్టారు దిగులుగా నవ్వుతూ,

"కృష్ణాపురం లాంటి శౌర్యభూమిలో పుట్టి యిలా మాట్లాడుతున్నారా? రామాపురం

## వెన్నెలలో నగరం

నాగరికతా వ్రణ రంగం నగరం
అంతు చిక్కని ఆడదాని
అద్భుత వాక్యం నగరం
రంగుదీపాల విద్యుత్కాంతితో
విహ్వలించే హరిత వృక్షం నగరం
అంతస్తుల కలల్ని ఆకాశంలోకి జాపి
పొగగొట్టాల విషపు నాలుకలను
గండు మీసాల్లాగ దూసే
కాలుష్య సర్పం నగరం-
తల్లి ఒడిలో పడుకుని
సీసాలో పోతపాలు తాగే
దురదృష్ట శిశువు నగరం-
వెన్నెలలో నగరం
ఉలిపొర కాగితం కప్పిన
చిరుతిండి జంగిడిలాగుంది
అంటీ అంటని పొడరు మరకలతో

అంతరాంతరాల్లో ఎక్కడో
తళుక్కున మెరుస్తూన్న
తంబురా శ్రుతి వంటి ప్రాణస్పందనం
అప్పుడప్పుడు జ్ఞాపకం తెచ్చుకునే
నిప్పుమీది పొగ నగరం.
అప్రయత్నంగా నవ్వగలిగే
వీధి వేశ్యలాగుంది
గొప్పకోసం పాకులాడే
స్వచ్ఛంద సంస్థల
సాంస్కృతిక కార్యక్రమంలాగ వుంది
మంటల మధ్య చిక్కుకున్న
మేధా గ్రంథాలయం లాగుంది.
నడుంవాల్చి కళ్లుమూసుకున్న
కర్మ వీరుల కలత నిద్రలాగుంది.

* * *

నేల నుంచి నింగికి విప్పుకున్న
అనార్తవ శక్రధనుఃఖండం నగరం
వెల్లగొడుగు కింద
వెలకిలా పడుకున్న ఏనుగు నగరం
ప్రశ్నలతో వేధించే బేతాళుడి
పీనుగు నగరం-
సమూహాలు ఆలపించే బృందగీతి నగరం.

-ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

పొలిమేరల్లో వున్న వాళ్లందరూ మీకు విరోధులై నపుడు నేను మాత్రం కానూ?'' అని కొంచెం ఆగి, తనే మళ్లీ ''మీలో ఎంతోమంది రామాపురం మీ కూతుళ్లనీ, చెల్లెళ్లనీ యిచ్చారు. అయితేనేం! ఆగడ్డ మీద గాలి పీల్చి జీవిస్తోన్న నేరానికి వాళ్లంతా మీకు విరోధులే! మీ ఆడబడుచుల పసుపు కుంకుమలైనా తుడిచేస్తారు గాని వాళ్లని క్షమించరు. మరి ఎక్కడినించో వచ్చిన నేను రామాపురం గ్రామవాసినయితే మీకు విరోధినికాక మరేమవుతాను?'' అన్నారు.

''మాష్టారూ!''

''అవును, బాబూ! మీకు వాళ్లంతా విరోధులు అనడానికి యింతకన్నా కారణం ఏమైనా వుందా?''

''వాళ్లు మా గ్రామవాసుల్ని యిద్దర్ని చంపారు''

''ఎవరు? రామాపురం ప్రజలు అయిదువేలమందీనా?''

''... ...''

''ఎంత గొప్పన్యాయం?! వ్యక్తికీ వ్యక్తిత్వానికీ ఏమీ విలువ లేదు. ఏదో ఓవూరికి చెందివుండడమనే యాదృచ్ఛిక సంఘటన మీ కావేషాలకి పునాది... చూశారా! మిత్రత్వానికీ,

## తరంగాలు

**చెవిని త్రిరుపెట్టి చిరునొప్పి వంకతో**
**కొట్టినాడు కన్ను కొంటెవాడు**
**సగము చీకటైన సగము వెలుతురైన**
**తనువు మెరసి నేను ధరణినైతి**

**—కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ**

శతృత్వానికీ మధ్యవున్న సరిహద్దు ఎంత బలహీనమైనదో?! అదిగో అలా చూడండి! అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతూ, ప్రకృతివైపరీత్యాలకి జీవితాలని ధారపోస్తూ, ఏదోక్షణికమైన వినోదం కోసం యీ జాతరలో పాల్గొంటూ, కర్రలు పట్టుకుని వీరావేశంతో గంతులేస్తోన్న ఆ వేల కొలది అమాయకులని చూడండి. వాళ్లల్లో ఎవరైనా మీలో ఎవరికైనా ఎప్పుడైనా అపకారం చేశాడా? గుర్తుపట్టి చూపించండి. కాని యిప్పుడు యిదే సమయంలో యిక్కడ నా బదులు ఆ అభాగ్యుల్లో ఎవరైనా వుండి వుంటే మీలో ఎవరైనా ఒక కన్నీటి బొట్టయినా రాల్చేవారా? ఎంతో వీరోచితంగా పగతీర్చుకున్నట్లు పొంగిపోయేవారు కారూ?! అందుకే నాయనా, చెబుతున్నాను. మంచికీ, చెడుకీ, ప్రేమకీ,ద్వేషానికీ, న్యాయానికీ అన్యాయానికి మధ్యవున్న సరిహద్దురేఖ చాలా బలహీనమైనది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఎక్కడినించో బ్రతుకు తెరువుకోసం వచ్చిన ఒక సామాన్యుడి మరణం మీ మనసుల్ని కదిలించగలిగితే అంతకన్నా యింక నాకు కావలసిందేముంది? బాబూ! ఏదీ! మీరంతా ఒకసారి కర్రలు విసిరేసి ఒకర్నొకరు కౌగిలించుకోండి. ఆనందంగా చూస్తాను'' అన్నారు.

రెండు గ్రామాల ప్రజలూ కర్రలు విసిరేసి ఆయన చెప్పినట్లే చేశారు.

గట్టులింగయ్య విగ్రహం ముందు ధ్యాన సమాధిలో కూర్చున్న భూతాచారి తొడపై పూజాపుష్పం ఒకటి దేవుడి కుడివైపు నుండి రాలి పడింది.

మన చుట్టూవుండే రకరకాల జీవితాలని
మన మనో దర్పణం మీద కళ్లకి కట్టినట్టు
చూపించే నేర్పుగల ఏకైక రచయిత్రి...
యద్దనపూడి సులోచనారాణి
జలపాతం
వెల రూ.25/- అన్ని పుస్తకాల షాపులలోను
దొరుకుతుంది లేదా 2/- తగ్గించి M.O.
పంపండి. ఆ 2/-కు V.P.P.
పంపుతాం.
ఈ నెలలో విడుదల!!
SILPA
క్వాలిటీ పబ్లిషర్స్
రామమందిరం వీధి,
విజయవాడ-520002.

అడ్మిషనులు ప్రారంభమయినవి
స్కూలు పునః ప్రారంభం
4 జూన్ 1985
స్థాపితము:1962 ఫోన్:22084
శ్రీ విద్యా విహార్ &
శ్రీ విద్యా విహార్ పబ్లిక్ స్కూల్
"ఆదర్శ గురుకుల విద్యాసంస్థలు"
లలితానందనగర్, రింగురోడ్, గుంటూరు-522006
బ్రాంచి: దాసరివారి వీధి, సూర్యారావుపేట,
విజయవాడ-2

నర్సరీ నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీషు & తెలుగు మీడియంలలో తరగతులు. ఇంకనూ-సైనిక స్కూలు, కోరుకొండ; పబ్లిక్ స్కూళ్ళ స్కాలర్‌షిప్స్ పరీక్షలు; డెహరాడూన్ మిలటరీ స్కూలు; తాడికొండ, సర్వేపల్లి మొ॥ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూళ్ళ పరీక్షలు మొదలగు ప్రవేశపరీక్షలకు ప్రత్యేక శిక్షణ.
★ స్థానికులకు స్కూలు బస్ సౌకర్యము కలదు★
APPLICATIONS ARE INVITED FOR TEACHER POSTS
PRAGATHI • advt..